క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయుడు సుబహాన్

నల్లచెరువు: మండల కేంద్రంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి నల్లచెరువుకు చెందిన వాదులపల్లి మస్తాన్ సాహెబ్ కుమారుడు వాదులపల్లి సుబహాన్, మస్తాన్ బి(ఉపాధ్యాయులు) దంపతులు రూ.1లక్ష విరాళంగా గురువారం అందజేశారు. దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, పడుచూరి నగేష్ కుమార్, పోరెడ్డి వెంటక రెడ్డి, మురళి, కేసీ వెంకటనారాయణ, రామాంజినేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర విభాగంలో ఇద్దరికి చోటు

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగంలో సత్యసాయి జిల్లా నుంచి ఇద్దరికి చోటు కల్పించారు. పుట్టపర్తికి చెందిన తిప్పన్న, ధర్మవరం నియోజకవర్గానికి చెందిన చౌడప్ప రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

బలవంతపు భూసేకరణ సరికాదు



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: అభివృద్ధి పనుల పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేపట్టడం ప్రభుత్వానికి తగదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పేరుతో ఏడాదికి రెండు మూడు పంటలు పండే సారవంతమైన భూమిని చిన్న సన్న కారు రైతుల నుంచి బలవంతంగా భూమిని తీసుకొంటున్నారన్నారు. అలాంటి సమయంలో రైతులు ఏం చేయాలో 2013 భూ సంరక్షణ చట్టం తెలియజేస్తుదన్నారు. చట్టంలో 13 అధ్యాయాలు, 114 సెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేస్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, ఫరంగి ప్రవీణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాలపల్లి పెద్దన్న హరి, నాయకుడు కదిరెప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ముదిగుబ్బ: మండలంలోని సంకేపల్లి క్రాస్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఒలిమి చెర్లోపల్లి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ముదిగుబ్బకు చెందిన గంగయ్య అనే వ్యక్తి బైక్‌పై వస్తూ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ముదిగుబ్బ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తి టౌన్: గోరంట్ల మండలం పంచాయతీ కార్యదర్శి ఫరూక్‌పై దాడి చేసిన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మెహన్, జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండలంలోని వేపరాల గ్రామంలో గురువారం రామాలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేదపండితులు స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ధర్మవరంఅర్బన్: కోటబసవన్నకట్టవీధిలో 20 అడుగుల భారీ వినాయకుడు



ధర్మవరంఅర్బన్: అయోధ్య రాముని అలంకరణలో వినాయకుడు



నల్లచెరువు మండలం ఉప్పార్లపల్లిలో కొలువుదీరిన గణనాథుడు



గాండ్లపెంటలో పూజలు అందుకున్న వినాయకుడు



తలుపుల మండలం ఎగువపేటలో కొలువైన వినాయకుడు



ముదిగుబ్బ మండలం సానేవారిపల్లిలో కొలువైన 14 అడుగుల మట్టి వినాయకుడు



ధర్మవరంఅర్బన్: క్రికెట్ కప్ సాధించిన క్రీడాకారుడిలా బొజ్జ గణపయ్య



ధర్మవరంఅర్బన్: లక్ష్మీనగర్‌లో పద్మనాభస్వామి అలంకరణలో గణనాథుడు

గణపయ్య.. కొలువుదీరెనయ్య

వినాయ చవితి ఉత్సవాల సందర్భంగా ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో వాడవాడలా గణపయ్యలు కొలువుదీరారు. బుధవారం ఉదయం నుంచి మండపాల్లో వినాయకున్ని కొలువుదీర్చి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పలుచోట్ల సాయంత్రం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

–సాక్షి బృందం



చెన్నేకొత్తపల్లిలోని కొత్త బీసీ కాలనీలో కొలువుదీరిన వినాయకుడు



ఓడీచెరువులో వినాయకుని ప్రతిమ వద్ద భజన చేస్తున్న చిన్నారులు




బత్తలపల్లి వాల్మీకి కాలనీలో గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న యువకులు



ధర్మవరం మండలం చిగిచెర్లలో వినాయకుని మండపం వద్ద యువకుల ఆనందోత్సాహం




పుట్టపర్తి మండలం పెడపల్లి పెద్దతండాలో పూజలు నిర్వహిస్తున్న యువకులు



కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో ముత్యాలమ్మ గుడి వద్ద కొలువైన గణేశుడు



చెన్నేకొత్తపల్లిలో ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద పూజలందుకున్న వినాయకుడు



ధర్మవరంఅర్బన్: కొత్తపేటలో హనుమాన్ గణేశ్

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు



మల్లిరెడ్డిపల్లిలో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తనకల్లు: మోసానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోకవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మల్లిరెడ్డిపల్లిలో మండల కన్వీనర్ అశోకవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్‌సిక్స్‌తో పాటూ అమలు కాని 143 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. పీ.ఫోర్ పేరుతో కూటమి నాయకులు మళ్లీ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉచిత బస్సు అని చెప్పి ఇప్పుడు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో చార్జీలు వసూలు చేయడంతో మహిళలు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 400 మంది దివ్యాంగుల పింఛన్లు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ జి శ్రీనివాసులు, నాయకులు శేఖర్‌రెడ్డి నీలారెడ్డి, ఎస్ రాజారెడ్డి, జి నారాయణ స్వామి, వెంకటరమణారెడ్డి, శీను నాయక్, హైదర్‌వలి, అక్బర్, మునియప్ప, మునిరాజు, శంకర,నగేష్, శివ, రెడ్డెప్ప, మహేష్, బాబు, శ్రీనివాసులు, వెంకటేషు, శంకర, కోటపల్లి సర్పంచ్ రామచంద్రారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, నగేష్, చలపతి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న డీడీఏ రాము నాయక్

ధర్మవరం రూరల్: రైతులు సాగు చేసిన పంటలకు ఈ- క్రాప్ నమోదు తప్పక చేయించుకోవాలని ఏడీఏ లక్ష్మానాయక్ రైతులకు సూచించారు. గురువారం కుణుతూరు గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం డీడీ రాము నాయక్, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, కంది సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కంది పంట పూత దశలో వుందని వేప నూనె తప్పని సరిగా పిచికారీ చేసుకోవాలన్నారు. కౌలు రైతులు ఆర్‌ఎస్‌కేల్లో సీసీఆర్‌సీ కార్డులను తీసుకోవాలని సూచించారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

కనగానపల్లి: ఖరీఫ్ వరి సాగులో సరైన మెలకువలు పాటించాలని జిల్లా వనరుల శాఖ డీడీఏ రామునాయక్ రైతులకు సూచించారు. దాదులూరులో గురువారం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మణ నాయక్ ఆధ్వర్యంలో వరి పంట సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ వరి నాటు వేసేటపుడు నారు కొనలు కత్తిరించాలన్నారు. వరి పొలంలో ప్రతి 10, 12 వరుసలకు ఒక కాలిబాట పెట్టుకోవాలన్నారు. జింక్ లోపం లేకుండా ఎకరాకు 10 కేజీల జింక్ సల్ఫేట్ వేసుకోవాలన్నారు. క్రిమిసంహారక మందులను ఎక్కువగా పిచికారీ చేసుకోరాదన్నారు. సమావేశంలో ఏఓ మాధురి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని 'స్వచ్ఛ దివస్'





కనగానపల్లిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు, యలకుంట్లలో నడి వీధిలో నీటిమడుగు

కనగానపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ జిల్లా వ్యాప్తంగా శనివారం 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివాస్' కార్యక్రమాలు జరిగాయి. కానీ మండలంలో ఎక్కడా కార్యక్రమాలు జరగలేదు. ప్రతి నెలా 4వ శనివారం ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టి పరిసరాల పరిశుభ్రత- ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులు కూడా ఆదేశాలు ఇస్తుంటారు. కానీ మండలంలోని పంచాయతీరాజ్ అధికారులు దీనిని తూతూ మంత్రంగా నిర్వహిస్తుండటంతో చాలా గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. మండలంలోని కనగానపల్లి, బాలేపాళ్యం, యలకుంట్ల, తూంచర్ల వంటి గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లపైనే వర్షపు నీరు, మురుగు నీరు నిలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో పరిశుభ్రత లోపించి దోమలు బెడద ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



పెడబల్లి జలాశయం వద్ద నిమజ్జనానికి అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వలిబాషా



కట్టకిందపల్లిలో నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ ప్రభాకర్

ఎన్పీకుంట: మండలంలో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్ఐ వలిబాషా ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం నిర్వహించడానికి అనువుగా ఉన్న మండల కేంద్రం సమీపంలోని కొత్తరోడ్డు వద్ద ఉన్న దేవరచెరువు, పెడబల్లి జలాశయాన్ని పోలీసు సిబ్బందితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పలు గ్రామాలలో పర్యటించి నిమజ్జనం కోసం తీసుకోవలసిన చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు.

బత్తలపల్లి: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రశాంతంగా జరుపుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం కట్టకిందపల్లి, డి.చెర్లోపల్లి, నల్లబోయనపల్లి, రామాపురంలో ఆయన పర్యటించి నిర్వాహకులకు నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

నిమ్మజ్జనానికి నీళ్లు ఎలా ?

బత్తలపల్లి మండలంలో తీవ్ర వర్షాభావం కారణంగా గణపతి నిమజ్జనానికి నీళ్లు కరువయ్యాయి. ఈ ఏడాది వర్షాలు భారీగా కురవని చెరువులకు, వాగులకు, కుంటల్లో నీరు చేరలేదు. రైతులు సాగు చేసిన పంటలపై వరుణదేవుడు కరుణించకపోవడంతో పంటలు పెద్దగా సాగుకు నోచుకోలేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిమజ్జనానికి సమీపంలోని చెరువులు, కుంటలను ఎంపిక చేసుకునేవారు. అయితే వర్షాలు కురవని కారణంగా ఈ ఏడాది నిమజ్జనం ఎలా చేయాలోనని మథన పడుతున్నారు. చిత్రావతి నది పరివాహాక ప్రాంతాల ప్రజలు మాత్రం నది వద్దకు వెళ్లి నిమజ్జనం చేసేందుకు నీరు ఉంది. మిగిలిన గ్రామాల ప్రజలకు ఎలాంటి అవకాశం లేదు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



నీటి డ్రమ్మును పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ధర్మవరం అర్బన్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని లక్ష్మీచెన్నకేశవపురం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు షాజియా, మలేరియా అసిస్టెంట్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని పార్థసారథినగర్‌లో గురువారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తించి నిర్మూలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు అభివృద్ధి చెందకుండా నిల్వ ఉన్న నీటిపై మూతలు పెట్టాలన్నారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించి నిల్వ ఉన్న నీటిని పారదోలి తొట్టెలను శుభ్రపరచాలన్నారు. సాయంత్రం వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. సీహెచ్ఓ సునిత, ఆశా కార్యకర్తలు రజియా, సాయిలీల పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి మహిళకు గాయాలు



తీవ్రంగా గాయపడిన ప్రశాంతి

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని పీఆర్‌టీ వీధికి చెందిన ప్రశాంతి గురువారం రాత్రి ఇంటిలో గ్యాస్ స్టవ్ మీద పాలు వేడి చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి దుస్తులకు వ్యాపించాయి. గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పివేసి వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు..



గాయపడిన ఉదయ్‌కిరణ్

పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఉదయ్‌కిరణ్ పట్టణం నుంచి కాలనీకి బైక్‌పై వెళుతుండగా ఎర్రగుంట సర్కిల్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉదయ్‌కిరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి



ధర్మవరంలో అమర వీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం రూరల్: విద్యుత్ ఉద్యమం సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్ బాగ్‌లో పోలీసులకాల్పులలో అసువులు బాసిన అమరవీరులకు సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, సీనియర్ నేత ఎస్‌హెచ్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. సీపీఎం నాయకులు ఆదినారాయణ, గుంపు హరి, నామాల నాగార్జున,ఆవుల రవి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సాకే లక్ష్మన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కదిరి అంబేడ్కర్ సర్కిల్ వద్ద బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముగ్గురు అమరులయ్యారన్నారు. సీపీఎం నాయకులు జగన్మోహన్, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, సీపీఐ నాయకులు పవన్‌కుమార్, లియాకత్, కదిరప్ప, మధునాయక్, రైతు సంఘం నాయకులు శంకర్ రెడ్డి, కృష్ణానాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: బషీర్‌బాగ్‌లో పోలీస్ కాల్పులలో అమరులైన వారికి ముదిగుబ్బ సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేసేదాకా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ప్రతిజ్ఞ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ నాయకులు బండల వెంకటేష్, బాబ్‌జాన్, పక్కీరప్ప, నష్షద్, రహీం బాషా, ఆది కేశవ, చాంద్ బాషా, హైదర్‌వలి, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

'సెక్టోరియల్' నియామకాల్లో మెరిట్‌కు తిలోదకాలు



మాట్లాడుతున్న టీచర్ తిరుపాల్

పుట్టపర్తి: సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ పోస్టుల నియామకాల్లో మెరిట్‌కు తిలోదకాలిచ్చారంటూ బాధిత ఉపాధ్యాయుడు, ఎనుమలపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ తిరుపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. తప్పిదాలను సరి చూడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించినా... జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. గురువారం పుట్టపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాస్తవానికి సెక్టోరియల్ పోస్టుకు తనకు అన్ని విధాల అర్హత ఉందన్నారు. తనకు జరిగిన అన్యాయంపై ఆధారాలతో సహా గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. కలెక్టర్ స్పందించి మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీ చేయాలని, తప్పిదాలను వెంటనే సవరించి న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా సమగ్ర శిక్ష అధికారులు ఎలాంటి అనుభవం లేని మరో ఉపాధ్యాయుడికి అధిక మార్కులు వేసి తనకు అన్యాయం చేశారని వాపోయారు. ఈ విషయాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.